ఉష్ణోగ్రత (అంచనా)

9-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	39	27
నరసరావుపేట	39	25
బాపట్ల	37	28
రెంటచింతల	39	26
చీరాల	37	28

ముస్లింల అభ్యున్నతికి సహకారం

● ఎమ్మెల్యే చదలవాడ



హజ్ యాత్రికులకు లక్ష రూపాయల నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

6

ఓ మోస్తరు వర్షానికే... తటాకాల్లా రోడ్లు

నరసరావుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ వర్షానికే చాలా ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి తటాకాలను తలపించాయి. వర్షపు నీటికి మురుగు నీరు తోడై ప్రవహించడంతో రహదారులు చిత్తడిచిత్తడిగా మారాయి. వర్షపు నీరు కాల్వల్లోకి ప్రవహించే పరిస్థితి లేకపోవడంతో రోడ్లపై నిలిచిపోతోంది. చిన్న వర్షానికే ఈ పరిస్థితి ఉంటే భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. కాల్వలపై ఆక్రమణలు, పూడిక తొలగింపులో అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ కష్టాలని ప్రజలు వాపోతున్నారు.



పాత పల్నాడు బస్టాండ్‌లో నిలిచిన వర్షం నీరు



పల్నాడు రోడ్డుపై నిలిచిన నీరు

ఈ-శ్రమ్... నిర్లక్ష్యం

- లక్ష్యం చేరుకోవడంలో అధికారుల విఫలం
- అసంఘటిత కార్మికులకు కార్డుల జారీ అంతంతే
- బహుళ ప్రయోజనాలున్నా అవగాహనపై ఉదాసీనం
- నమోదుకు దూరంగా ఇంకా ఏడు లక్షల మంది శ్రామికులు

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు.. గాయపడితే లక్ష వరకు ఆర్థిక సాయం. అసంఘటిత రంగ కార్మికులకు పైసా ఖర్చు లేకుండా బీమా అందించేలా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డును ప్రవేశపెట్టింది. కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ప్రాయోజిత పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలకు అర్హులుగా తేల్చడానికి కూడా ఈ-శ్రమ్ ప్రామాణికంగా ఉపయోగపడనుంది. అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ఈ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కార్మికులకు అవగాహన కల్పించి ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకునేలా వారిని చైతన్యపరచాల్సిన యంత్రాంగం ఉదాసీనంగా ఉంటున్నది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వారీగా లక్ష్యాలకు ఆమడ దూరంలో కార్మికశాఖ ఉంది. మూడు జిల్లాల్లో ఇంకా 7 లక్షల మంది కార్మికులు ఈ-శ్రమ్‌కు దూరంగా ఉంటున్నారంటే అధికారుల్లో నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రాయోజిత పథకం ఈ-శ్రమ్. ఇందులో నమోదు చేసుకున్న కార్మికుడికి ఈ-శ్రమ కార్డును ప్రభుత్వం అందించనుంది. కార్మికులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించగా.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ అదే ధోరణి కనిపిస్తోంది. కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రధానంగా ఈ పథకంపై క్షేత్రస్థాయిలో కార్మికులకు అవగాహన కల్పించే వారే కరువయ్యారు. అసంఘటిత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడే ఈ-శ్రమ్ కార్డు విషయంలో నెలవారీగా సమీక్షలు జరిపి పురోగతి తెలుసుకోవడం కూడా లేదు. మొక్కుబడిగా ఓ ప్రకటన ఇచ్చి వదిలేయడం తప్పితే లక్ష్యాలను చేరుకుని పథకం ఫలాలను కార్మికులకు చేరుస్తామన్న చిత్తశుద్ధి యంత్రాంగంలో కొరవడింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోని కార్మికుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు ఏడు లక్షల మంది వరకు ఉన్నట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే రెండున్నర లక్షలమంది ఈ పథకానికి దూరంగానే ఉన్నారు. ఈ-శ్రమ్ నమోదుకు సంబంధించి సచివాలయాల వారీగా కార్మికశాఖ సమీక్ష చేయ లేదు. నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉన్నా నమోదులో గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నామనే ఆర్భాటపు ప్రకటనలకే కార్మికశాఖ పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి. పైగా కార్మికుల డేటా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉన్నందున నమోదులో జాప్యం జరుగుతుందనేది యంత్రాంగం వాదన. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగిన అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ పథకానికి అర్హులు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని చిరువ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, ఆశా వర్కర్లు, మత్స్యకారులు, ఉపాధి హామీ శ్రామికులు, ఆటో డ్రైవర్లు, రిక్షా, రాడ్ బెండింగ్, ప్లబింగ్, టైల్స్, కరెంటు, వెల్డింగ్, ఇటుక తదితర రంగాలలో పనిచేసే వారందరూ కూడా అర్హులే. కానీ వీరిలో చాలామందికి ఈ-శ్రమ్‌లాంటి ఓ పథకం ఉందని కూడా తెలియకపోవడం విశేషం. పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, సీఎస్సీ కేంద్రాలు, కార్మికశాఖ కార్యాలయంలో అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ-శ్రమ్ కార్డు నమోదుకు రూ.13 చొప్పున ఇస్తామని ప్రకటించి కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులకు రూ.50 లక్షలు బకాయి పెట్టింది. దీంతో ఆయా సెంటర్ల నిర్వాహకులు ఈ-శ్రమ్ కార్డు నమోదును నిరుత్సాహ పరుస్తున్నట్లు సమాచారం.



ఫీజు.. పత్రాలని పీడింపు

ఈ-శ్రమ్‌పై అవగాహనతో కొందరు నమోదుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నా వారిని ఫీజు, ధ్రువీకరణపత్రాలంటూ పీడిస్తున్నట్లు సమాచారం. నమోదుకు ఎలాంటి ఫీజు అవసరం లేదు. అయితే కొన్ని చోట్ల రిజిష్టర్ పేరిట వసూళ్లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. నమోదుకు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పాటు ఆధార్‌కు లింక్ అయి ఉన్న ఫోన్ నంబరు, నామినీ ఆధార్ వివరాలు చాలు. కానీ ఏవేవో పత్రాలు కావాలని తమను తిప్పుకుంటున్నారని కార్మికులు వాపోతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు.. నాలుగో ఎలైన్‌మెంట్

- 47.848 కిలోమీటర్ల పొడవునా ప్రతిపాదిత మార్గం
- ఎన్‌హెచ్-216, ఎస్‌హెచ్-261, 269, 334, 279, 350 మీదగా నిర్మాణం
- ఈ రూట్ అయితే బహుళ ప్రయోజనాలున్నాయని కన్సల్టెన్సీ అభిప్రాయం
- అమరావతి ఓఆర్ఆర్-నిజాంపట్నం పోర్టు హైవేకు కేంద్రం ఆమోదం

ఖర్చు తక్కువ.. పర్యాటకం

గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా నాలుగో ఎలైన్‌మెంట్‌కు అటు కన్సల్టెన్సీ ఇటు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో ఎన్‌హెచ్-216, రాష్ట్ర హైవేలు-261, 269, 334, 279, 350 మీదగా రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు తగ్గుతుందని అంచనా వేశారు. ఈ హైవేతో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన సూర్యలంక, చీరాల బీచ్‌లు, క్షీర భావన్నారాయణ స్వామి, సుందరవల్లి, జిల్లెళ్లమూడి అమ్మవారు, సహస్రలింగేశ్వర, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు పర్యాటకం పెరుగుతుందని డీపీఆర్ రూపొందించిన సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది.

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్మించబోయే అమరావతి అవుటర్ రింగురోడ్డులో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు నుంచి బాపట్ల జిల్లా నిజాంపట్నం పోర్టు వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకి సుముఖత వ్యక్తపరిచింది. ఇందుకోసం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ నివేదించేందుకు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఆ సంస్థ తొలుత మూడు ఎలైన్‌మెంట్లను పరిశీలించి నివేదిక అందజేసింది. కొత్తగా నాల్గో ఎలైన్‌మెంట్‌ని కూడా సిద్ధం చేసి ప్రజంటేషన్ ఇచ్చింది. సామాజిక ప్రభావం తక్కువగా, ఖర్చు తక్కువయ్యే ఈ నాలుగో ఎలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే పర్యాటకం పెరుగుతుందని కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్‌లో పొందుపరిచింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు రూ.1391.46 కోట్లయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇందులో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.240.98 కోట్లు, నిర్మాణాలకు రూ.890.93 కోట్లు అవుతాయని డీపీఆర్‌లో పొందుపరిచారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు అత్యుత్తమైన కనెక్టివిటి పెరుగుతుంది. సూర్యలంకలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్సు బేస్‌స్టేషన్, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌కు కనెక్టివిటీ పెరిగి స్థానికంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. అంతేకాకుండా రాష్ట్ర హైవేలు ఎస్‌హెచ్-240, 261పై ట్రాఫిక్ తగ్గి సరుకు రవాణా వేగవంతంగా జరుగుతుంది. 1975లో 27.87 ఎకరాల అటవీ మళ్లింపు జరగ్గా ఇందులో 17.87 ఎకరాలను ఫిషింగ్ హార్బర్ అప్రోచ్‌కు వినియోగిస్తున్నారు. మిగతా భూమిలో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఏపీఎంబీ సీఈవో ఎన్‌వోసీ కూడా జారీ చేశారు. పర్యావరణ హితంగా నిర్మించబోయే ఈ రోడ్డు మార్గంలో మొత్తం 24 చోట్ల కెనాల్/రివర్ క్రాసింగ్స్ చేయాలి. అలానే విజయవాడ-గూడూరు సెక్షన్‌లో చుండూరు రైల్వేస్టేషన్‌కు సమీపంలో 12+245 వద్ద రైల్వే క్రాసింగ్ కూడా చేయాల్సి ఉంటుంది. రేపల్లె - బాపట్ల డీసీ/ఎస్‌సీ లైన్(పీ)లో 28+550 లొకేషన్ వద్ద 132 కేవీ పవర్ లైన్‌ని కూడా క్రాస్ చేయాల్సి ఉన్నది. ఈ డీపీఆర్‌కి కేంద్రం కనక ఆమోదం తెలిపితే ఆరు నెలల్లో భూసేకరణ, ఏడాది వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును త్వరితగతిన గ్రౌండింగ్ చేసేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ టీ కృష్ణప్రసాదు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.



మ్యాప్‌లో నీలం రంగులో ఉన్న ప్రాధాన్య ప్రతిపాదిత ఎలైన్‌మెంట్

రాబోయే ప్రాజెక్టులు

ఈ ఎలైన్‌మెంట్ వెంట కొత్తగా పలు ప్రాజెక్టులు రాబోతున్నాయి. నల్లపాడు - కృష్ణాకెనాల్ రైల్ ఓవర్ రైల్, కృష్ణాకెనాల్ - నల్లపాడు 3, 4 రైలు మార్గాలు, ఈస్టు కోస్టు కారిడార్ భవిష్యత్ డీఎఫ్‌సీ, కృష్ణానది వంతెన మీదగా గుడివాడ - తెనాలి(విజయవాడను బైపాసు చేస్తూ) రోడ్డు మార్గం వంటి ప్రాజెక్టులు ఇప్పటికే మంజూరై ఉన్నాయి.

మాచర్లలో 8 వేల మందికి ఉపాధి

● రూ.కోట్లతో రాయవరం పారిశ్రామికవాడలో సదుపాయాలు ● ఎంఎస్ఎంఈల భూమిపూజలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం పారిశ్రామికవాడలో పరిశ్రమలను స్థాపించి ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా మరో 3 వేల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం రాయవరం శివారులోని ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ (ఏపీఐఐసీ) భూముల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.7 కోట్లతో మౌలిక వసతుల పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. రాయవరం వద్ద 200 ఎకరాలను పరిశ్రమల శాఖకు 2018లో భూములు కేటాయిస్తే జగన్‌రెడ్డి హయాంలో పట్టించుకోలేదన్నారు. గతంలో మాచర్లలో అరాచక పాలన రాజ్యమేలిందని, అందుకే పరిశ్రమలు స్థాపనకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఈ భూముల్లో పరిశ్రమలకు కావాల్సిన మౌలిక వసతుల కోసం రూ.7 కోట్లు, తర్వాత మరో రూ.9 కోట్లను ప్రభుత్వం కేటాయింపులు చేసిందన్నారు. ఇప్పటికే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు పలువురు నమోదు చేసుకున్నారని, త్వరలో పరిశ్రమల స్థాపనకు అడుగులు పడనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ డాక్టర్ ఎం ఎల్ నరసింహారావు, డిప్యూటి మేనేజర్లు మధు, కృష్ణమోహన్, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రేపటి నుంచి మిర్చియార్డు బంద్

◆ వచ్చే నెల 9 వరకు క్రయవిక్రయాలు నిలిపివేత

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో క్రయవిక్రయాలు శుక్రవారం సాయంత్రంతో ముగుస్తాయి. వేసవి సెలవుల కారణంగా మార్కెటింగ్ శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. శనివారం నుంచి యార్డులో ఎటువంటి కార్యకలాపాలు జరగవు. తిరిగి జూన్ 9న మిర్చియార్డులో లావాదేవీలు పునః ప్రారంభమౌతాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వరకే యార్డులో మిరపకాయలను విక్రయించుకోవడానికి తెచ్చుకోవాలని, ఈ విషయంలో రైతులు సహకరించాలని యార్డు వర్గాలు విజ్ఞప్తి చేశాయి. కాగా ఇప్పటికే యార్డుకు మిర్చి టిక్కీల సంఖ్య రాక తగ్గిపోయింది. రోజుకు లక్ష లోపే టిక్కీలు వస్తున్నాయి. వాటిల్లోనూ కాయ సైజు చాలా తక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే స్థానికంగా కారం తయారీకి డిమాండ్‌తో వాటిని ఎగుమతిదారులు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్డుకు ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ నెల 13 నుంచి జూన్ 24వ తేదీ వరకు(ప్రతీ మంగళవారం) (07421) చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు ఉదయం 6.55కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా 11.55కి గుంటూరు, రాత్రి 10.45కి శ్రీకాకుళం రోడ్డు చేరుకుటుంది. (07422) శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 14 నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతీ బుధవారం బయలుదేరి గుంటూరు మీదగా చర్లపల్లి చేరుతుంది.

సైనిక్ స్కూల్‌కు అనుమతులు మంజూరు

శ్రీరామా విద్యా సంస్థల చైర్మన్ తులసీ విష్ణుప్రసాద్



కొల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు శ్రీరామా విద్యా సంస్థల చైర్మన్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్ గురువారం తెలిపారు. చిలుమూరు విద్యా సంస్థలో విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 1949లో కొలసాని వెంకటసుబ్బయ్య శ్రీరామా గురుకుల పాఠశాలను స్థాపించారని తెలిపారు. 2021లో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 100 ప్రైవేట్ సైనిక్ స్కూళ్లను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయాలని భావించిందన్నారు. దానిలో భాగంగా సైనిక్ స్కూల్ ఏర్పాటుకు దరఖాస్తు చేయగా.. వారం క్రితం కేంద్ర ప్రభుత్వం, డిఫెన్స్ శాఖల నుంచి అనుమతులు మంజూరు కావడంతో.. మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ పూర్తి చేయడం జరిగిందన్నాని వివరించారు. దేశ వ్యాప్తంగా కేవలం 33 సైనిక్ పాఠశాలలు ఉండగా.. నూతనంగా ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు మాత్రమే ఎంపికయ్యాయని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో సైనిక్ స్కూల్ అడ్మిషన్స్‌కు అనుమతులు పొందినట్లు చెప్పారు. ఇక నుంచి శ్రీరామా సైనిక్ స్కూల్‌గా నామకరణం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొలసాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమాలను అరికట్టారా?

మిర్చియార్డు అధికారులను ప్రశ్నించిన మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడలోని తన కార్యాలయానికి పిలిపించుకుని ప్రశ్నల వర్షం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): యార్డులో అవినీతి, అక్రమాలను ఎంతవరకు అరికట్టారు.. లైసెన్సింగ్ సిస్టమ్‌లో ఎలాంటి మార్పులు చేశారు.. జీరోలు, కటింగ్, బిల్ టూ బిల్, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేయడం వంటివి అరికట్టారా.. అని మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మిర్చియార్డు అధికారులకు పలు ప్రశ్నలను సంధించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయానికి మార్కెటింగ్, మిర్చియార్డు అధికారులను పిలిచి మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికతో పాటు ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఆంజనేయ సింగ్, ఇతర సెక్రెటరీలు హాజరయ్యారు కాగా ఆరు నెలల క్రితం తాను జారీ చేసిన ఆదేశాలు ఏమేరకు అమలు చేశారని ఆరా తీశారు. యార్డులో వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ విభాగం గత ఏడాది దర్యాప్తు చేసి రూ. 436 కోట్ల మేరకు అవినీతి జరిగినట్లుగా పేర్కొంటూ అందుకు కొంతమంది అధికారులను బాధ్యులను చేసి రిపోర్టు ఇచ్చింది. దాంతో గత నవంబరులో మంత్రి అచ్చెన్నాయుడు గుంటూరు మార్కెటింగ్ కమిషనరేట్‌కు వచ్చి ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. జీరో బిజినెస్, కటింగ్ బిజినెస్ వల్ల యార్డు ఆదాయం పోతున్నదని ఈ సమావేశంలో కొంతమంది రైతులు, వ్యాపారులు మంత్రి సమక్షంలో చెప్పారు. బిల్ టూ బిల్‌తో వ్యాపారులు 2 శాతం కంటే అధికంగా కమీషన్‌ని వసూలు చేస్తున్నారని కొందరు రైతులు మంత్రికి ఫిర్యాదు చేశారు. యార్డులో లైసెన్సింగ్ వ్యవస్థ పకడ్బందీగా లేదని చెప్పారు. ఒక్కో కుటుంబంలో నాలుగైదు లైసెన్సులు పొంది ఉన్నారని, కొందరైతే లైసెన్సులు లీజుకు తీసుకొని అనధికారికంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వీటిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి లైసెన్సింగ్ వ్యవస్థ మొత్తాన్ని అధ్యయనం చేసి తనకు నివేదిక అందజేయాలని అప్పట్లో ఆదేశించారు. అది ఎంతమేరకు వచ్చిందని గురువారం జరిగిన సమావేశంలో అధికారులను ప్రశ్నించారు. ఒక కుటుంబానికి ఒక లైసెన్సుకు మించి ఉండరాదని, త్రీమెన్ కమిటీ రిపోర్టు లేకుండా లైసెన్సులు మంజూరు చేయడం, రెన్యువల్స్ వంటివి చేయరాదని స్పష్టం చేశారు. మిర్చి సీజన్ శుక్రవారంతో ముగియనున్నందున పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోల్డ్‌స్టోరేజ్‌లు, మిర్చి గోడౌన్లు వంటి ప్రదేశాల్లో క్రయవిక్రయాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా పెట్టాలన్నారు. చెక్‌పోస్టులను పటిష్టం చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. కాగా మంత్రి అడిగిన ప్రశ్నలు అధికారులు స్పష్టంగా సమాధానాలు చెప్పలేకపోయారని తెలిసింది.

హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా

అధునాతన టెక్నాలజీతో కేసును ఛేదించిన పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇటుకరాయితో తలపై మోదీ ఓ వ్యక్తిని హతమార్చినట్లు నేరం రుజువడంతో నిందితుడు పట్టణంలోని శివసంజీవ కాలనీకి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కరివేదుల సంపత్‌రెడ్డి(45) 2023 మే 9న నరసరావుపేటకు వచ్చి స్థానిక గాంధీపార్క్ సమీపంలో తీవ్రగాయాలతో మృతి చెందాడు. అతడి తండ్రి కరివేదుల నరసింహారెడ్డి ఫిర్యాదు మేకరకు మొదటి పట్టణ పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్లపందిగా గుర్తించారు. నిద్రలో ఉన్న సంపత్‌రెడ్డిను ఇటుకతో కొట్టి అతడి వద్ద ఉన్న నగదును అంకమ్మరావు తీసుకువెళ్లినట్లు సీసీ ఫుటేజి ఆధారంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ మేరకు అంకమ్మరావును అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్‌కుమార్ కేసును దర్యాప్తు చేశారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

గుంటూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు మెగా డీఎస్సీ క్రాష్ కోర్స్ శిక్షణను ఉచితంగా ఇస్తామని విభిన్న ప్రతిభావంతులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ తదితర విభిన్న ప్రతిభావంతులైన, అభ్యర్థులు విజయవాడలో నిర్వహించే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం 40% శాతం వికలత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని, టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 11 వరకు ఎంపీఎఫ్‌సి.ఏపీసిఎఫ్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముస్లింల అభ్యున్నతికి సహకారం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తరువాత రాజకీయాలకు అతీతంగా ముస్లిం సోదరుల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం దాచేపల్లిలోని విజయ భాస్కర కల్యాణ మండపంలో హజ్ యాత్రకు వెళ్తున్న ముగ్గురు ముస్లిం సోదరులకు లక్ష రూపాయల చొప్పున ఆయన ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేనితో పాటు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జనాబ్ షేక్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హస్సేన్ బాషా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ సూపర్ - 6లో భాగంగా హజ్ యాత్రికులకు లక్ష రూపాయల చొప్పున అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 48 మందిని హజ్ యాత్రకు పంపించామని, రూ.50 లక్షలకు పైగా అందజేశామని వివరించారు. ముస్లిం సోదరుడి ఇల్లు తాకట్టులో ఉంటే తాను రూ.3 లక్షలు చెల్లించి విడిపించానని గుర్తుచేశారు. అల్లా దయ వల్ల అందరూ బాగుండాలని ఆయన వేడుకొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లడం పవిత్ర కార్యక్రమం అన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జనాబ్ షేక్ మౌలానా ముస్తక్ అహమ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముస్లిం సోదరుల హజ్ యాత్రకు సహకరించడం అనేది ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గొప్పతనమన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హస్సేన్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింల పక్షపాతి కలిగిన ఎమ్మెల్యే అంటే మొట్టమొదట గుర్తు వచ్చేది ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరేనని తెలిపారు. పిడుగురాళ్ల మునిసిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మీర్జా హఫీజ్ హస్సేన్, సయ్యద్ అమీర్ అలీ, షేక్ బాబావలి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 23 మూగజీవాలు మృతి



చెట్టుకింద మృతి చెందిన మేకలు

కొల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 23 మూగజీవాలు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అనంతవరంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. కార్మూరి వెంకటరామయ్యకు చెందిన మూగజీవాలు చింత చెట్టు కిందకు చేరాయి. అదే సమయంలో చింత చెట్టుపై పిడుగు పడటంతో 23 మేకలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు వరకు ఉంటుందని యజమాని తెలిపాడు. విషయాన్ని పశు వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు తెలియజేయడంతో.. వైద్యులు మృతి చెందిన మూగజీవాలను పరిశీలించారు. మేకల మృతిపై పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

ఘర్షణ కేసులో మూడు నెలల జైలు శిక్ష

నాదెండ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు గ్రామంలో జరిగిన ఘర్షణ కేసులో చెవుల నరేంద్ర అనే వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. 2018లో కన పర్రు గ్రామానికి చెందిన చీరాల అరవింద సాయి, అదే గ్రామానికి చెందిన చెవుల నరేంద్ర ఘర్షణ పడ్డారు. అరవింద సా యి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కొమ్మా లపాటి చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. వాదన లు విన్న ఏజేసీజే కోర్టు న్యాయమూర్తి స్వాతి నరేంద్రకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

●ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



సభలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ కళాశాల అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి తెలిపారు. కళాశాల 80వ వార్షికోత్సవం గురువారం కళాశాలలోని డాక్టర్ బి వి.నాథ్ ఆడిటోరియంలో జరిగింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను పెంపొందించుకోవాలని చెప్పారు. నూతన అవకాశాలు గురించి విద్యార్థులకు డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు వివరించారు. వ్యవసాయ విద్య ప్రాముఖ్యత గురించి డీన్ డాక్టర్ ఏవీ రమణ తెలిపారు. సాహిత్య, క్రీడ, సాంస్కృతిక పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరింపచేశాయి. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.ప్రసూనారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థికి ఫీజు రాయితీ ధ్రువీకరణ పత్రం అందజేత

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 8, (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఉదయం ఎస్సీ, ఎస్టీ ఓబీసీ కోటా కింద విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి ఓపెన్ కేటగిరి మెరిట్ విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. అడ్మిషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 11న ఆదివారం వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. కేఎల్ఈ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన వారితో పాటు.. ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. జేఈఈలో అత్యుత్తమ పర్సంటైల్ పొందిన విద్యార్థులకు కూడా మెరిట్ స్కాలర్‌షిప్స్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. కేఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో 3వ ర్యాంకు పొందిన ఆళ్ల వెంకట సాయి, అఖిల్‌కు, క్రీడల విభాగంలో జీగ్నాష్‌కు సీఎస్ఈ కోర్సులో 50 శాతం ఫీజు రాయితీతో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, కౌన్సిలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జగదీష్, కన్వీనర్ డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు అధికారికంగా ప్రవేశాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

పొన్నెకల్లు(తాడికొండ)మే 8(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి పొన్నెకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన పేర్ల అన్నపూర్ణ(70) కొంతకాలంగా వెన్ను ముక నొప్పి కారణంతో.. పూర్తిగా మంచానికే పరి మితమైంది. బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయి, తిరిగి వచ్చిన క్రమంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయింది. మంటలు వ్యాపించి అన్నపూర్ణ పూర్తిగా కాలిపోయింది. పై అంతస్తులో ఉన్న కూమార్తె, అమె భర్త గమని ంచి కిందకు వచ్చే సరికి మరణించింది. గురువారం మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆయుష్ వైద్యశాల స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రత్తిపాడు, మే 8 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని నడింపాలెం ఆయుష్ వైద్యశాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన బృందం గురువారం పరిశీలించింది. గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిలో సర్వే నెంబరు 149/4ఏ లో 14.96 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ వైద్యశాలకు కేటాయించింది. డిల్లీ నుండి వచ్చిన సీసీఆర్ వైఎన్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రావు, అసిస్టెంట్ డైరెక్టర్ కన్సల్టెంట్ ఎ.మోహన్‌రావు, భారత్ భూషన్, మినిస్ట్రి ఆఫ్ ఆయుష్ కన్సల్టెంట్ ఎంఏ ఖాన్ బృందం ఈ భూమిని పరిశీలించింది. ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ పూర్తి వివరాలు బృందానికి అందించారు. వీరి వెంట రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సిన్హా పాల్గొన్నారు.

భూమి ఇవ్వలేదని.. తల్లిదండ్రులపై హత్యాయత్నం

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పేరుమీద ఉన్న 2.75 ఎకరాల భూమిని తమకు ఇవ్వడం లేదని వారిని పెట్రోల్ పోసి చంపు తామని బెదిరిం చిన కుమారుడు, కుమార్తె బెదిరించారు. ఈ ఘటన ఎండ్రాయి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రాజధాని అమరావతి ప్రభావంతో ఎండ్రాయి గ్రామంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వం పూలింగ్‌కు తీసుకుంటామనడంతో గ్రామానికి చెందిన షేక్ సైదులు కుమారుడు నాగుల్ మీరా, కుమార్తె జాన్‌బీ, అల్లుడు అల్లాభక్షు నాలుగు రోజుల నుండి వృద్ధులపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. భూమి మీకు ఇస్తే..తామెలా బతకాలని సైదులు, అతని భార్య ఇందుకు నిరాకరించారు. ఉదయం తల్లిదండ్రులపై బిడ్డలిద్దరూ పెట్రోల్ పోశారు. భూమి తమకు పేరున రాసివ్వకపోతే.. చంపుతామని బెదిరించారు. చుట్టుపక్కల వారు అడ్డుపడి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వృద్ధులిద్దరినీ స్టేషన్‌కు తీసుకువచ్చి సమాచారం సేకరించారు. వారి కొడుకు, కూతరు, అల్లుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిపై మామ అత్యాచారయత్నం

మాచవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): కోడలిపై మామ అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. మాచవరం ఏఎస్ఐ పుల్లారావు వివరాల మేరకు.. కొత్తపాలెం గ్రామానికి చెందిన మురికిపూడి సౌభాగ్యరాజుకు.. బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామానికి చెందిన మరియకుమారితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 2న పొలానికి వెళ్లి వచ్చిన మరియకుమారి ఇంట్లో ఉండగా.. మామ నరసయ్య అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని పాపాయపాలెంలోని తల్లిదండ్రులకు మరియకుమారి తెలియజేసింది. బుధవారం రాత్రి మాచవరం పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సత్తెనపల్లి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. అయితే శవ పంచనామాలో మృత దేహం వద్ద లభించిన లేఖలో..తన చావుకు ముగ్గురు కారణమని మృతురాలు పేర్కొంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అబ్బూరు గ్రామానికి చెందిన ఒంటిపులి వాణి(28) పది రోజుల క్రితం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ వాణి గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతురాలికి ఐదేళ్ల క్రితం వివాహం అయ్యింది.. భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి గుంటూరు జీజీహెచ్‌కి వెళ్లి పంచనామ నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి వద్ద ఒక లేఖను గుర్తించారు. గ్రామానికి చెందిన ఇద్దరు తనను లైంగికంగా వేధిస్తున్నారని, వారి వేదింపులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఉంది. ఓ మహిళ కూడా ఇద్ద రితో చనువుగా ఉంటున్నావని, తన భర్తకు చెప్తానని బెదిరించేదని లేఖలో రాసుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	142, 151, 162
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

96,256 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు గురువారం 91,812 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,364 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13400
నంబరు.5	10000	12500
273	----	----
341	10000	13300
4884	10000	11200
సూపర్10	10000	12600
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12500
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

సత్తెనపల్లి నుంచి అరుణాచలానికి బస్సు

సత్తెనపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ఈనెల 10వ తేదీ రాత్రి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ విజయకుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. 10వ తేదీ రాత్రి 9 గంటలకు సత్తెనపల్లి డిపోలో బయలు దేరి 11వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదే రాత్రికి అరుణాచలంకు చేరి దర్శనం అనంతరం 12వ తేదీ కంచికి చేరి అనంతరం 13వ తేదీ ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. రాను పోను టిక్కెట్ ధర రూ.2500 అన్నారు. సత్తెనపల్లి ప్రాంతంలోని భక్తులు, యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 99592 25429 నెంబరులో సంప్రదించాలన్నారు.



మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తదితరులు

ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇవ్వండి

● డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

మాచవరం, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి స్థానిక అధికారులను ఆదేశించారు. గురువారం మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో వెంగళరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వచ్చే జూన్, జూలై మాసాల లోపు ఉద్యాన పంటలు సాగుచేసే రైతులను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేద్యపు నీటి కుంటలకు గ్రామాల్లో ఇంకుడు గుంతలకు, పశువుల నీటి తొట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పని దినాలను పూర్తిచేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఆయా గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచి రోజువారీ రూ.300 వేతనం పడేలా పనిని గుర్తించి చేయించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన వసతులు ఏర్పాటుచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. అనంతరం పిల్లుట్ల గ్రామంలో ఏర్పాటుచేస్తున్న సేద్యపు కుంటను పరిశీలించి ఉపాధి హామీ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఏపీవో కోటిరెడ్డి, ఉద్యానశాఖ అధికారి మోహన్, వ్యవసాయశాఖ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన

సత్తెనపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజారులో వినియోగదారలకు తూనికలు, కొలతల శాఖ సత్తెనపల్లి ఏరియా ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా గురువారం అవగాహన కల్పించారు. కూరగాయలు కొనే సమయంలో తూకాలను వినియోగదారులు గమనించాలన్నారు. ప్రతి సంవత్సరం కాటాలను స్టాంపింగ్‌కు పంపించి రసీదు పొందాలన్నారు. తూకాల్లో తేడాలుంటే సంబంధిత అధికారులకు గాని, వినియోగదారుల సంఘానికి గాని ఫిర్యాదు చేయవచ్చన్నారు.

హజ్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

సత్తెనపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసాన్‌బాషాను గురువారం ఏకో ఓవర్సీస్ కార్యాలయంలో ముస్లింలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల అభివృద్ధికి చేయూత నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సయ్యద్ పెద కరిముల్లా, నూర్‌బాషా జానీబాబు, రాంబో బుడే, సయ్యద్ మాబూ, దూద్‌కే, అబ్దుల్ గౌస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు న్యాయవాదులకు పదవులు

సత్తెనపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా పట్టణానికి చెందిన న్యాయవాదులు సేవా బాబూరావు, పాటిబండ్ల రవిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

ముప్పాళ్ళ, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. పగలంతా ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. మిర్చి, మొక్కజొన్న రైతులు అకాల వర్షం నుండి తమ పంటలను కాపాడుకునేందుకు కల్లాలో పట్టలను కప్పుకున్నారు.

మిర్చి ట్రక్కు బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం

సత్తెనపల్లి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): మిర్చి లోడుతో వెళ్తున్న ట్రక్కు సత్తెనపల్లి - గుంటూరు ప్రధాన రహదారిపై మండలంలోని కంటెపూడి వద్ద గురువారం బోల్తా పడింది. సత్తెనపల్లి నుంచి మిర్చి లోడుతో గుంటూరు వెళ్తున్న ట్రాక్టర్ గ్రామం వద్ద స్పీడు బ్రేకర్ ఎక్కగానే ట్రక్కు రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో సత్తెనపల్లి వైపు, గుంటూరు వైపు వెళ్ళే వాహనాలు నిలిచిపోయాయి. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గోదాముల నిర్వహణపై అవగాహనా సదస్సు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ సహకార సంవత్సరం-25ను పురస్కరించుకుని మండలంలోని మండెపూడి గ్రామంలో నరుకుళ్లపాడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు గోదాముల నిర్వహణపై అవగాహనా సదస్సు జరిగింది. బుధవారం రాత్రి జరిగిన సదస్సులో సంఘ పర్సన్ ఇన్‌చార్జి మోజెస్, సీఈవో వెంకటేశ్వరరావు, మునగోడు పీఏసీఎస్ సీఈవో బీ సాంబశివరావులు పాల్గొని రైతులకు గోదాముల నిర్వహణ, దాని వలన ఉపయోగాలు తదితర అంశాలకు సంబంధించి అవగాహన కల్పించారు.

గొట్టిముక్కల సర్పంచ్‌గా అకుల్

గురజాలటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కల సర్పంచ్‌గా కటికల అకుల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్న నాగరాజు సెలవుపై వెళ్లడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న అకుల్ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అకుల్‌ను కూటమి నేతలు సన్మానించారు. కార్యక్రమంలో జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, నేలవల్లి బొల్లయ్య, రాయపాటి రవి, బాణావత్ నరసింహ నాయక్, పోలురాజు, బత్తుల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మీ ఇల్లయితే ఇలాగే ఉంచుతారా?

● పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై ఎమ్మెల్యే యరపతినేని ఆగ్రహం

పిడుగురాళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై మీ ఇల్లయితే ఇలానే వుంచుకుంటారా.. అంటూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైద్యాధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో వున్న పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే వైద్యాధికారుల గది, పేషెంట్ల గది, ల్యాబరేటరీ, మందుల గది, ఓపీ ప్రాంతాలను పరిశీలించారు. ఆ సమయంలో వైద్యాధికారులు ఇద్దరూ పీహెచ్‌సీలో లేరు. ఎమ్మెల్యే వచ్చారని తెలుసుకున్న వైద్యాధికారి ప్రభావతి పీహెచ్‌సీకి చేరుకున్నారు. పీహెచ్‌సీలో ఖాళీగా వున్న అట్టపెట్టెలు చెదలుపట్టి వుండటాన్ని గుర్తించిన ఎమ్మెల్యే సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఆసుపత్రి ఫ్లోరింగ్ కూడా దుమ్ము, ధూళితో వుండటాన్ని గుర్తించి వైద్యాధికారిని ఇలాగేనా వుంచేదంటూ ప్రశ్నించగా సిబ్బంది ఎవరూ లేరని సమాధానం ఇచ్చాక అలా అయితే మున్సిపల్ కమిషనర్‌కు చెబితే పారిశుధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తారు కదా.... ఇలా వుంటే రోగులెలా వస్తారని ప్రశ్నించారు. ఆసుపత్రి పరిశుభ్రంగా వుంటే రోగులకు ఆసుపత్రి వైద్యసేవలపై నమ్మకం పెరుగుతుందన్నారు. మరో వారంలో కలెక్టర్‌తో సహా ఎంపీ, జిల్లా అధికారులతో ఇక్కడే సమీక్ష ఏర్పాటు చేస్తామన్నారు. కాగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రభావతిపై రోగులు, సిబ్బంది నుంచి పలు ఆరోపణలున్నాయి. సమయపాలన పాటించరని, సిబ్బందిపైనే బాధ్యత వదిలేస్తుంటారని, ఒక్కోరోజు పీహెచ్‌సీకి రారని కొందరు సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం గురజాల నియోజకవర్గ స్థాయి సమీక్ష వచ్చే వారం పిడుగురాళ్లలో నిర్వహించనున్న దృష్ట్యా ఎమ్మెల్యే జడ్పీ హైస్కూల్, మార్కెట్‌యార్డు ప్రాంతాలను పరిశీలించారు.

పార్టీ అండగా ఉంటుంది..

పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కుటుంబాన్ని తాను గుర్తుంచుకుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కరాలపాడు గ్రామానికి చెందిన మద్దసాని మంగిరెడ్డి మాతృమూర్తి మల్లేశ్వరమ్మ దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే, కుటుంబసభ్యులను పరామర్శించారు.



ఓబన్న విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం

సత్తెనపల్లి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకణాలపల్లిలో శ్రీవీరాంజనేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. భారీ అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట బుచ్చిబాబు, పచ్చ సుధీర్, దరువూరి నాగేశ్వరరావు, సోలా నంబి, మోహన్, బీజేపీ నాయకులు కట్టా శంకర రావు పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

సత్తెనపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న వడ్డె ఓబన్న విగ్రహ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, బత్తుల వెంకటస్వామి, నియోజకవర్గ వడ్డెర సంఘం నేతలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా చేయాలి

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి

మాచర్ల రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామ, మండలస్థాయి కమిటీల ద్వారా ఏ కేటగిరిలోని గ్రామాలన్నింటిని సారా రహిత గ్రామాలుగా చేయాలని ఎక్సైజ్ శాఖ గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ ఎం రవికుమార్‌రెడ్డి అన్నారు. నవోదయం 2 వో కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా సారా రహిత గ్రామాలుగా చేసేందుకు కృషి చేయాలన్నారు. దుర్గి, మాచర్ల, వెల్దుర్తి మండలాలను ఈనెలాఖరు నాటికి సారా రహిత మండలాలుగా ప్రకటించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్‌వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి

నేడు వ్యవసాయ పనిముట్ల పంపిణీ

రెంటచింతల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతలు మీదుగా శుక్రవారం వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయనున్నట్లు ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. తొలి విడతగా 26మంది రైతులకు అందచేస్తారన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల, మే 8(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మేరి కనకం కోరారు. రేషన్‌కార్డు లేనివారు కొత్తగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే సభ్యుల చేర్పులు, తొలగింపు, కార్డుల విభజన చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ చైర్మన్‌గా మదార్ సాహెబ్ ప్రమాణ స్వీకారం

మాచర్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ మున్సిపల్ చైర్మన్‌గా 27వ వార్డు షేక్ మదార్‌సాహెబ్ గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం మున్సిపల్ సాధారణ సమావేశం జరపనున్నారు.

వ్యక్తిపై దాడి

మాచర్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై కర్రతో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని ఏడోమైలులో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉప్పలపాటి రోశయ్య తాటికల్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి రోశయ్య తమ్ముడి కుమార్తె ధనలక్ష్మితో అదే గ్రామానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసరావు నా భార్యతో ఎందుకు మాట్లాడావు అంటూ ఘర్షణ పడ్డాడు. ఇది గమనించిన రోశయ్య భార్య ఎల్లమ్మ ఎందుకు గొడవ పడుతున్నావు అంటూ శ్రీనివాసరావును ప్రశ్నించగా ఆమెను దుర్భాషలాడాడు. ఈ క్రమంలో రోశయ్య సర్దిచెప్పేందుకు వెళ్లగా శ్రీనివాసరావు కర్రతో రోశయ్య తలపై దాడి చేసి గాయపరిచాడు. గాయాలపాలైన రోశయ్యను కుటుంబసభ్యులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మకం

● శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి

రెంటచింతల, మే 8(ఆంధ్రజ్యోతి): టెర్రరిస్టులను మట్టుపెట్టడంలో భారత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రశంసనీయమని, 26 మందిని పొట్టనపెట్టుకున్న ముష్కరులకు తగిన శాస్తి జరిగిందని శిల్పారామం చైర్మన్ చేగ్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళల మంగళ సూత్రాలను తెంపిన టెర్రరిస్టులు మహిళా పైలట్ల చేతిలో దారుణంగా హతమయ్యారన్నారు. ఉగ్రవాదులు హతమవ్వడం వలన మృతిచెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. ఈమె వెంట ఆర్యవైశ్య నేత కొత్త అంజి తదితరులున్నారు.

టీడీపీ అధ్యక్షుల ఎన్నిక

● కారంపూడి పట్టణ అధ్యక్షుడిగా శేషగిరి



బొమ్మిన శేషగిరి

కారంపూడి, మే 8(ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు కారంపూడిలో గురువారం పార్టీ నేతలు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఏకాభిప్రాయంతో గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. కారంపూడి పట్టణ అధ్యక్షుడిగా బొమ్మిన శేషగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే తెలుగు రైతు, తెలుగు మహిళ, తెలుగు యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్, ఐటీడీపీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, ఉన్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మునుగోటి సత్యం, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, దోర్నాల బ్రహ్మారెడ్డి, కోదాటి ప్రభాకర్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులోకి అగ్రిల్యాబ్

● క్రోసూరు ఏడీఏ హనుమంతరావు



క్రోసూరులోని నియోజకవర్గ స్థాయి అగ్రి ల్యాబ్

క్రోసూరు, మే 8(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతాంగానికి, లైసెన్స్ ఉన్న డీలర్లకు క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని అగ్రికల్చర్ ల్యాబ్‌ను అందుబాటులో ఉంచినట్లు ఏడీఏ వీ హనుమంతరావు గురువారం తెలిపారు. రైతులు, విత్తనాల డీలర్లు తమ విత్తనాలను, ఎరువులను అగ్రి ల్యాబ్‌లో తగిన రుసుం చెల్లించి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఎరువుల, విత్తనాల జన్యు స్వచ్ఛత ఇక్కడ పరీక్ష జరుపుతా రన్నారు. విత్తన నమూనాలకు మొలక శాతం, విత్తనాల తేమ శాతం పరీక్షలు జరుగుతాయన్నారు. రైతులకు విత్తనాల, ఎరువుల పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో గాని, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి తమ నమూనాలను వారికి సమర్పించి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. నేరుగా అగ్రిటెస్టింగ్ సిబ్బందికి కూడా నమూనాలు అందజేయవచ్చన్నారు. ఏడు నుంచి పదిరోజుల వ్యవధిలో ఫలితాలు అందజేస్తామన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ హబ్.. క్రోసూరు

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కోర్సుల్లో శిక్షణ
● తరచూ జాబ్ మేళాలు, ఉద్యోగ అవకాశాలు
● త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సులు ప్రారంభం

క్రోసూరు, మే 8(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో వందలాది మంది నిరుద్యోగులు ఇక్కడ శిక్షణ పొందారు. అంతేగాక స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఆధ్వర్యంలో కళాశాలలోనే తరచుగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు. రెండు నెలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. 2023లో ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ప్రారంభమైనప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతనే శిక్షణ కోర్సులు, జాబ్ మేళాలు తరచుగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ ఎంట్రీ ఆపరేటర్ మొదలైన స్వల్ప కాలిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఎనిమిది బృందాలు శిక్షణ పొందాయని, సుమారు 250 మంది వరకు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారని నిర్వాహకులు చెపుతున్నారు.

జాబ్ మేళాలతో ఉపాధి

స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఆరుసార్లు మినీ జాబ్ మేళాలు, ఒక సారి మెగా జాబ్ మేళా నిర్వహించారు. మినీ జాబ్ మేళాల ద్వారా సుమారు రెండు వందల మందికి.. మెగా జాబ్ మేళా ద్వారా సుమారు నాలుగు వందల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఉద్యోగ మేళాలో ఎక్కువ భాగం స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు మాత్రమే పాల్గొంటున్నారు. నెలకు రూ.15 వేలు నుంచి రూ.35వేలు వరకు వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. అగ్రిడ్రోన్స్ కంపెనీ, బయోటెక్, హెటిరో, ఐసీఐసీఐ తదితర కంపెనీల్లో ఇప్పటి వరకు అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఆధ్వర్యంలో రానున్న రెండు నెలల్లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ కోర్సులు కూడా ప్రారంభం కానున్నాయి. డేటా ఎలనిస్టు, బీఐ డెవలప్పర్, మొబైల్ అప్లికేషన్ డెవలప్పర్ తదితర కోర్సుల్లో ఆరు నెలల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాలను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎక్కువగా గృహిణుల హాజరు

పాలి టెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌కు ఎక్కువ భాగం గృహిణులు హాజరవుతున్నారు. శిక్షణ పొందినప్పటికీ కేవలం 20 శాతం మంది మాత్రమే ఉద్యోగాలు చేయడానికి ముందుకొస్తున్నారు. శిక్షణ పొందిన పురుష అభ్యర్థులు 50 శాతం ఉపాధి పొందుతున్నారు. భవిష్యత్తులో హబ్‌ను మరింత విస్తరించడం జరుగుతుంది.

-అంజిరెడ్డి, హబ్ కో-ఆర్డినేటర్



హజ్ యాత్రికులను సన్మానించిన ఎమ్మెల్యే యరపతినేని, పక్కన రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తక్ అహమ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్ బాషా తదితరులు

ఆత్మీయ సన్మానంతో ముస్లింలలో భరోసా

ఎమ్మెల్యే యరపతినేనికి మైనార్టీ నేతల అభినందనలు

దాచేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మక్కా, హజ్ యాత్రికులకు ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి గురజాల నియోజకవర్గం నుంచి వేలాదిగా ముస్లింలు జరయ్యారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీ విజయ భాస్కర థియేటర్‌లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేపట్టిన ఆత్మీయ సదస్సుల్లో హజ్‌యాత్రకు వెళ్తున్న దాచేపల్లికి చెందిన షేక్ యూనస్ పౌజియా బేగం దంపతులు, మాచవరం మండలం తురకపాలెంకు చెందిన షేక్ నాగుల్‌మీరా, పాతిమాబీ దంపతులు, మహమ్మద్ అస్రప్ అహమ్మద్ షేక్ హసీనా దంపతులకు రూ.లక్ష చొప్పున రూ.3లక్షల నగదును అందజేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి నియోజకవర్గంలో హజ్ యాత్రికులకు నగదు సాయంతోపాటు మదర్సాలు, మసీదులు, షాదీఖానాలు, ఈద్గాల నిర్మాణానికి ఎమ్మెల్యే సహకరిస్తున్నారు. గత నాలుగేళ్లలో వైసీపీ పాలనలో ముస్లింలపై దాడులు, తప్పుడు కేసులు, వయోవృద్ధులపై రేప్ కేసులు, హత్యాయత్నాల కేసులు బనాయించటంతో తల్లడిల్లినవారు యరపతినేని భరోసాతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ముస్లింలు గజమాలతో యరపతినేనిని సన్మానించారు. సమావేశంలోషేక్ బాబావలి, సయ్యద్ అమీర్ ఆలీ, అబ్దుల్ అఫీజ్ సాబ్, వలి, చికెన్ జానీబాషా, టీడీపీ యూత్ మండల అధ్యక్షుడు నాయబ్ అబ్దుల్లా, పొందుగుల రెహ్మాన్, మైనార్టీ నాయకులు తుల్లా, షేక్ మహమ్మద్ రఫీ, చింతపల్లి హసన్ అహమ్మద్, బెల్లంకొండ బద్రి, తంగెళ్ళ శ్రీనివాసరావు, అక్కినపల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ప్రవీణ్



సీఎం చంద్రబాబు నాయుడిని కలసి నియోజకవర్గ పరిస్థితులను వివరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కలసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ప్రధాన సమస్యలు, అభివృద్ధి పనుల ప్రాధాన్యత, నీరు, విద్యుత్, రోడ్లు, ఆరోగ్యసేవల వంటి రంగాల్లో అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సీఎంకు వివరించారు. పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

● డుమ్మా కొట్టిన ఎంపీపీ, పలువురు ఎంపీటీసీలు

కారంపూడి, మే 8(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించాల్సిన ఎంపీపీ మేకల శారద సమావేశానికి గైర్హాజరవడం విశేషం. అలాగే మరికొందరు ఎంపీటీసీలు కూడా సమావేశానికి డుమ్మా కొట్టారు. గతంలో జరిగిన మండల పరిషత్ ఎన్నికలలో కారంపూడి మండలానికి సంబంధించి 15 ఎంపీటీసీలకు గాను మొత్తం వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒప్పిచర్ల, పేటసన్నిగండ్లకు చెందిన ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. వేపకంపల్లి ఎంపీటీసీ కోకా అక్కమ్మ అనారోగ్య కారణాలతో మరణించారు. సమావేశానికి ఐదుగురు ఎంపీటీసీలు హాజరయ్యారని, కోరం కావడంతో సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు అధికారులు బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారని, కనీసం గౌరవవేతనం కూడా అందించడం లేదని గైర్హాజరైన ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. 16 నెలల నుంచి గౌరవవేతనం పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు.

క్రోసూరు ఎస్ఐకి టీడీపీ నాయకుల సత్కారం



క్రోసూరు ఎస్ఐని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

క్రోసూరు, మే 8(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎస్ఐగా నియమితులైన పీ రవి బాబును స్థానిక టీడీపీ నాయకులు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఉన్న పలు సమస్యల గురించి టీడీపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, డాక్టర్ మహమ్మద్ షరీఫ్, నలజాల కోటేశ్వరరావు, మన్నెం శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, షేక్ సలాం, మాజీ ఎంపీపీ ఏ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కోనూరులో వీరబ్రహ్మేంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

అచ్చంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు గ్రామంలో గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నూతన దేవాలయ కీర్తి ధ్వజ స్తంభంతో పాటు శ్రీ గోవిందమాంబ సమేత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోప్రత్యేకపూజలు నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 8(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 513.60 అడుగులు ఉంది. ఇది 137.86 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల...

అచ్చంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 22.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపక దినోత్సవం

సత్తెనపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన, సొసైటీ సేవలను నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దరువూరి నాగేశ్వరరావు, నరిచేటి వేణుగోపాల్, పుట్టి సాంబశివరావు, రావెల చంద్రశేఖర్, కాపు గంటి రత్తయ్య, దాసరి కోటేశ్వరరావు, వల్లూరి శ్రీనివాసరావు, ధనేకుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఏఏంవో పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

● సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వీ సుబ్బారావు

నరసరావుపేట టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉర్దూ అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వీ సుబ్బారావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 26వ తేదీ లోపు అధికారుల ద్వారా ధ్రువీకరణ దరఖాస్తులను డీఈవో, సమగ్ర శిక్ష, పల్నాడు కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేయదలచినవారు అదనపు సమాచారం కోసం డీఈవో, సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏఎంవో/జీసీడీవో డీ రేవతి, 9440642122, ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ కే శ్రీనివాసరావు, 8074499649లో సంప్రదించాలన్నారు.

నాలుగు వార్డులకు టీడీపీ కొత్త కమిటీలు

చిలకలూరిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 4 వార్డులకు నూతన కార్యవర్గాల ఎన్నిక జరిగింది. కొత్త కార్యవర్గాల వివరాలను టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి గురువారం తెలిపారు. 11వ వార్డుకు అధ్యక్షులుగా బెజ్జం రవి, ప్రధాన కార్యదర్శిగా పఠన్ సుభాని, 22వ వార్డుకు గోపిదేసి శివ, ప్రధాన కార్యదర్శిగా మద్ది గురునాధం, 29వ వార్డుకు అధ్యక్షుడిగా పట్నం కరిముల్లా, ప్రధాన కార్యదర్శిగా షేక్ కలేషా, 36వ వార్డు అధ్యక్షుడిగా ఈదర వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా కాశియ్యలను ఎన్నుకొన్నారు.

ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా గోరంట్ల


సత్యనారాయణ

ఈపూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈపూరు వ్యవసాయమార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా శావల్యాపురంనకు చెందిన గోరంట్ల సత్యనారాయణను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు యార్డు కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. సత్యనారాయణ ఉమ్మడి గుంటూరు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా, రైల్వేబోర్డు మెంబరుగా పనిచేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు సత్యనారాయణను అభినందించారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్ల వితరణ


ఫ్యాన్లను బహూకరిస్తున్న అర్వపల్లి ట్రస్ట్ నిర్వాహకులు అర్వపల్లి నర్సింహారావు

నరసరావుపేట కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామిరెడ్డి పేటలోని శ్రీ రాఘవేంద్రా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి గురువారం అర్వపల్లి ట్రస్ట్ నిర్వహకులు, విజేత ఎలక్ట్రానిక్స్ అధినేత అర్వపల్లి నర్సింహారావు రెం డు ఫ్యాన్లను బహూకరించారు. ఈ మేరకు ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో నిర్వహకురాలు పూనూరి కృష్ణకుమారికి అందజేశారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

రొంపిచర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగార్ల పాడు గ్రామానికి చెందిన గట్లు చిన్నమ్మ(55) పిడుగుపాటుకు గురువారం మృతి చెందింది. నరసరావుపేట మండలం పాలపాడు సమీపంలో జరిగిన ఘటనలో పిడుగుపాటుకు గురై మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నలగార్లపాడు గ్రామానికి చెందిన పెద అంకిరెడ్డి భార్య ఈమె. వీరికి కుమారుడు ఉన్నాడు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిలకలూరిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామ నివాసి చెంబేటి శ్రీను(43) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందాడు. కుటుంబంలో జరిగిన గొడవ వల్ల అతడి కుమారుడు రామకృష్ణ తండ్రిని కొట్టినట్టుగా సమాచారం. ఇందుకు సంబంధించి మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొంపిచర్లలో వేసవి విజ్ఞాన శిబిరం

రొంపిచర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతున్నాయి. గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్టు గ్రంథాలయ అధికారి సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

బొల్లాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెంగుంట, గాటి తండా గ్రామాల్లో పోలేరమ్మ తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి వాటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఏ బాలకృష్ణ భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొచ్చెర్లలో నిలిచిన చెత్త సేకరణ

- తొమ్మిది నెలలుగా చెల్లించని వేతనాలు..
- కుటుంబం గడవని స్థితిలో కార్మికులు
- సర్పంచ్, కార్యదర్శుల నిర్లక్ష్యమే.. కారణమని చెబుతున్న గ్రామస్థులు

ఈపూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల పంచాయతీలో పది రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోయింది. గ్రీన్ అంబాసిడర్‌లు నిరసన తెలుపుతూ చెత్త సేకరణ నిలిపివేశారు. పది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, అడుగుతుంటే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. అప్పులు చేసి బతుకుతున్నామని, చిల్లర దుకాణాల్లో అప్పు ఇవ్వడం లేదని అన్నారు. కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో చెత్త సేకరణ నిలిపి వేసినట్లు కార్మికులు తెలిపారు. పంచాయతీ పరిధిలో 9 మంది కార్మికులు ఉన్నారు. ప్రతి రోజు ఉదయం గ్రామంలో చెత్త సేకరించి కి.మీ దూరంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రానికి తరలిస్తారు. ఆ తరువాత డ్రైనేజీలోని మురుగు తొలగిస్తారు. ప్రస్తుతం వారు పనుల్లోకి రాకపోవడం వల్ల గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది. మురుగుకాల్వలు పూడిపోయి దుర్వాసన వస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.


గ్రామంలో పేరుకుపోయిన చెత్త


సచివాలయం వద్ద పనిముట్లతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ సర్పంచ్‌కి కార్యదర్శికి మధ్య ఉన్న విభేదాల వల్లనే గ్రామంలో చాలా వరకు అభివృద్ధి పనులు ఆలస్యమౌతున్నాయని గ్రామస్థులు అంటున్నారు. పంచాయతీలో గత ప్రభుత్వంలో అవకతవకలు జరగాయని వాటి గురించి కార్యదర్శి అడగడం వల్లనే విభేదాలకు కారణంగా చెబుతున్నారు.

పంచాయతీ నిధులు ఇవ్వడానికి లేదు

● కార్యదర్శి తిరుపతయ్య

పంచాయతీ నిధుల నుంచి కార్మికుల వేతనాలు ఇవ్వడానికి లేదు. సర్పంచ్ కోర్టుకు వెళ్లడం వల్ల నిధులు ఖర్చు చేయొద్దని కోర్టు నోటీసులు ఇచ్చింది. సర్పంచ్‌తో మరోసారి మాట్లాడి రెండు రోజుల్లో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులు ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువుల పెంపకానికి అందించే ప్రోత్సాహకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం కోరారు. మండలంలోని పసుమర్రు గ్రామంలో రాష్ట్ర పశువైద్యవిభాగం ఆధ్వర్యంలో జరిగిన సబ్సిడీ పశుగ్రాస, పశువుల దాణా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓడరేవు నకరికల్లు రోడ్డు నిర్మాణంలో భాగంగా పసుమర్రు వద్ద బైపాస్ నిర్మాణానికి భూములిచ్చి తక్కువ నష్టపరిహారం పొందిన రైతులకు ప్రభుత్వం నుంచి త్వరలోనే న్యాయమైన పరిహారం అందుతుందని ప్రత్తిపాటి తెలిపారు. గత ప్రభుత్వం పసుమర్రు సహా కొన్ని పంచాయతీలను ఇష్టానుసారం మున్సిపాలిటీల్లో కలిపిందని, ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా వ్యవహరించారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా పశువైద్యాధికారులు కాంతారావు, ఏడీ శ్రీనివాసరావు, రాధాకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, కూటమి నేతలు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, భాషా తదితరులు పాల్గొన్నారు.


సబ్సిడీ పశుదాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

స్థానిక 100 పడకల ప్రభుత్వాస్పత్రిని ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రోగులతో మాట్లాడి వైద్యులు, సిబ్బంది పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలు లేకుండా వైద్యులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. రోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులదేనని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు, ఆస్పత్రి కమిటీ సభ్యులు ఉన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కారించాలి


నిరసనలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

నరసరావుపేట టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని సీహెచ్‌వోలు కోరారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీ పార్కు వద్ద 11వ రోజు నిరవధిక నిరసన సమ్మెలను కొనసాగించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వోలు మాట్లాడుతూ సోషల్ మీడియాలో సీహెచ్‌వోలు ఇతర కేడర్లను కించపరుస్తూ కామెంట్స్ పెట్టారని అభియోగం వచ్చిందన్నారు. ఎవరో కావాలని కొత్త గా అకౌంట్ తెరచి కేడర్ల మధ్య చిచ్చు పెట్టేరీతిగా రెచ్చగొట్టే ధోరణిలో వాఖ్యలు చేయడం గమనించామన్నారు. అసోసియేషన్ తరపున ఆయా క్యాడర్లకు క్షమాపణ తెలియజేస్తూ, ఆ ఫేక్ అకౌంట్ మీద సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశామన్నారు. జరిగిన ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తపరుస్తూ, ప్రజారోగ్య వ్యవస్థలో పనిచేస్తున్న అందరం ఒక కుటుంబంలా మెలుగుతూ ఏ ఒక్క కేడర్‌నీ అవమానించేలా వ్యవహరించడం సరికాదన్నారు. కించపరిచేలా వ్యాఖ్యలు చేయకుండా, గౌరవంగా అవగాహనతో పనిచేస్తూ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అనుపమా, వినోద్, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

29న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

చిలకలూరిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో మెగా ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులైన టీడీపీ నేత, ఆర్టీసీ టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఎన్నోఏళ్లుగా ప్రత్తిపాటి ఫౌండేషన్ పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నదని ఈ సందర్భంగా కంచర్ల చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్ ను, కరపత్రాలను ఎమ్మెల్యే పుల్లారావు ఆవిష్కరించారు.

జీవనోపాధి వార్షిక రుణ ప్రణాళికపై శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకులు ఝాన్సీరాణి

నరసరావుపేట కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కోటప్పకొండలోని టీటీడీసీ సమావేశ మందిరంలో గురువారం జీవనోపాధి వార్షిక రుణ ప్రణాళిక 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని ఏపీఎంలకు, సీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి సంస్థ పథక సంచాలకులు ఝాన్సీరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా జిల్లాలోని 36500 స్వయం సహాయక సంఘాలకు సభ్యుల అవసరాలకనుగుణంగా వారి జీవన ప్రమాణాలు పెంపొందించుటపై అవగాహన కల్పించారు. తదుపరి అందరూ కలిసి మండలస్థాయిలో గ్రామ సమాఖ్య అధ్యక్షులకు, గ్రామ సమాఖ్య సహాయకులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. శిక్షణ అనంతరం వారి అవసరాలకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవనోపాధి పెంపొందించుకునేందుకు ఎంత రుణం కావాలో రుణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హార్టికల్చర్ జిల్లా అధికారి రమణారెడ్డి మాట్లాడు తూ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయుటకు డీఆర్‌పీలను సాయం తీసుకుని లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు, స్త్రీనిధి ఏజీఎం తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యాయామశాల ప్రారంభం


వ్యాయామశాలను ప్రారంభించిన ముఖ్యఅతిథి రాంబాబు, కళాశాల ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు

నరసరావుపేట టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో గు రు వారం అధునాతన వ్యాయామ శాల ప్రారంభించారు. ముఖ్య అతిథిగా నరసరావుపేట ఏపీసీపీడీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రాంబాబు హాజరై వ్యాయామశాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబోధనతో పాటు శారీరక దారుఢ్యం అందించేందుకు కళాశాల ప్రాంగణంలోనే అధునాతన వ్యాయామశాలను నెలకొల్పడం హర్షణీయం అన్నారు. కళాశాల వీడీ హెచ్ గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసం కోసం నెలకొల్పిన ఈ వ్యాయామ శాలలో అధునాతన సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ నాగ మల్లేశ్వరరావు, చైర్మన్ మీరావలి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం


హెన్రీ డ్యూనాన్ట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

చిలకలూరిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియార స్థంభం సెంటర్‌లో జంపని భాస్కరరావు కార్యాలయంలో గురువారం సాయంత్రం అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు. తొలుత రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాన్ట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట రెడ్‌క్రాస్ కార్యదర్శి జంపని భాస్కరరావు మాట్లాడుతూ సేవే పరమావధిగా ఈ సంస్థను స్థాపించారన్నారు. కార్యక్రమంలో కారుమంచి శివరావు, చెన్నకేశవుల రమేష్ బాబు, చుక్కా విన్సెంట్ పాల్, గోగినేని నాగేశ్వరరావు, పెంచలయ్య, సుబ్బారావు, ఉమర్ పాల్గొన్నారు.

వాగ్దేవి జూనియర్ కాలేజీలో..

నరసరావుపేట టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి జూనియర్ కాలేజీలో గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. చెవి, ముక్కు పరీక్షలు డాక్టర్ కే జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించారు. దంత పరీక్షలు డాక్టర్ రహంతుల్లా, నేత్ర పరీక్షలు డాక్టర్ సృజన నిర్వహించారు. ముఖ్యఅతిథి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కే జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో విద్యార్థులు సభ్యులుగా చేరవచ్చునన్నారు. వలంటీర్‌గా పనిచేసినా, లేదా రక్తదానం చేసిన సర్టిఫికెట్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖకు రూ.2లక్షలు నష్టం


ఈదురుగాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు

యడ్లపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతోపాటు కురిసిన వర్షానికి విద్యుత్ శాఖకు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ ఏఈఈ జెర్నీజయకర్ తెలిపారు. 15 విద్యుత్ స్తంభాలు, వాటికి అమర్చిన కండకర్లు, వైర్లు, కాసారాలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పరికరాల స్థానంలో కొత్తవాటిని వెంటనే అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారన్నారు.

దెబ్బతిన్న గృహాలను పరిశీలించిన తహసీల్దార్

ఈదురు గాలుల ధాటికి దెబ్బతిన్న గృహాలను తహసీల్దార్ విజయశ్రీ గురువారం పరిశీలించారు. బుధవారం ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షానికి సంగంగోపాలపురం, చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామాల పరిధిలో చెట్టు విరిగి ఇళ్లపై పడటంతో దెబ్బతినగా, ఆ విషయాన్ని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తెచ్చారు. దీనితో ఎమ్మెల్యే నష్టానికి సంబంధించిన అంచనాలను తయారుచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనితో టీడీపీ నాయకులతో కలసి సంగం గోపాలపురంలో పర్యటించి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. నష్ట అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు.

పండ్లు, పూలతోటల సాగుతో ఆర్థిక అభివృద్ధి

● జిల్లా ఉద్యానశాఖాధికారి నవీన్


సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

ఈపూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పండ్లు, పూలతోటల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని తోటల సాగుకోసం ప్రభుత్వం రాయితీ కూడా అందజేస్తుందని ఉద్యానశాఖ జిల్లా అధికారి దాసరి నవీన్‌కుమార్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న కారు రైతులు పండ్లు, పూలమొక్కలు సాగు చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీ అందిస్తామన్నారు. పండ్లు, పూల తోటలు సాగు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి, ఎంపీడీవో కే ప్రభాకర్, ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, ఏపీవో పుష్పరాజ్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన

బొల్లాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు బొల్లాపల్లి గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన జరగనున్నట్టు ఎంపీడీవో పీ సీతారామయ్య గురువారం తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ పీ అరుణ్‌బాబు హాజరవుతారన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


కృష్ణాపురంలో ప్రత్యేక పూజలు చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

శావల్యాపురం(కృష్ణాపురం), మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురంలో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు అయినాల నాగేశ్వరరావు, కడియాల ఆంజనేయశాస్త్రి, సొలస శివయ్యశాస్త్రిల ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రోచ్చారణలతో మహాగణపతి, వీరబ్రహ్మేంద్రస్వామి, శివలింగం, నందీశ్వరుడు, శిఖర కలశం, ధ్వజస్థంభాలను ప్రతిష్ఠించారు. భక్తులు పెదసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సీనియర్ నాయకులు గడిపూడి విశ్వనాధం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, గోనుగుంట్ల ధనుంజయ్, సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, పూజారులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

'ఫోరెన్సిక్ సాక్ష్యాల నిర్వహణ' పై చర్చ

నరసరావుపేట లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టరేట్ గుర్రం జాషు వా కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారు లకు 'ఫోరెన్సిక్ సాక్ష్యాల నిర్వహణ' అనే అంశంపై చర్చ నిర్వహిం చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్‌లు, సీఐలు, డీఎస్పీలు పాల్గొన్నారు. దర్యాప్తు ప్రక్రియకు ఉపకరించే అనేక మెళకువలను పోలీస్ అధికారులకు ఫోరె న్సిక్ నిపుణులు వివరించారు. ఈ చర్చా వేదిక ద్వారా ఏదైనా కేసుకు సంబం ధించి ఘటన జరిగిన ప్రదేశం నుంచి న్యాయస్థానంలో కేసు విచారణకు వెళ్ళే వరకు పొందుపరచే ప్రతి ఆధారాన్ని భౌతికంగా, సాంకేతిక పరంగా ఏ విధంగా సేకరించాలనే విషయాలను గురించి కూలంకషంగా నిపుణులు వివరించారు.

ఫోరెన్సిక్ సాంకేతిక అంశాల ఆధారంగా పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే దొంగతనం, హత్య, అత్యాచారం, ఆత్మహత్య, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలు మొదలైన విషయాలకు సంబంధించిన కేసుల్లో ఘటన జరిగిన ప్రదేశం నుంచి న్యాయస్థానాల్లో కేసుకు సంబంధించిన ఆధారాలు ప్రవేశపెట్టే వరకు ఉన్న అన్ని ఘటనల్లో భౌతిక ఆధారాలు సేకరించాలన్నారు. వీటితోపాటు సాంకేతిక ఆధారాలను కూడా సేకరించాలన్నారు. వీటిని సేకరించే సాంకేతిక విధానాలను వివరించారు. ఇటువంటి ప్రత్యేక చర్చా వేదిక కార్యక్రమాల నిర్వహణకు ప్రోత్సహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్త, సౌత్ కోస్టల్ జోన్ ఐజీసర్వ శ్రేష్ట త్రిపాఠి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చా వేదికలో జిల్లా పోలీసు అధికారులకు కేసుల దర్యాప్తుకు సంబంధించి పలు మెళకువలను అందజేసిన ఫోరెన్సిక్ నిపుణుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారులను ఎస్పీ కంచి శ్రీనివాసరావు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు.

గృహ నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలి

● గృహ నిర్మాణశాఖ ఈఈ శివలింగం


సాంకేతిక సహాయకులతో సమావేశమైన ఈఈ శివలింగం, ఎంపీడీవో హేమలత


యడ్లపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): వివిధ దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను లబ్ధిదారులు సత్వరమే పూర్తి చేసేలా అందుకనుగుణంగా సచివాలయ సాంకేతిక సహాయకులు చర్యలు చేపట్టాలని గృహనిర్మాణశాఖ ఈఈ శివలింగం ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హేమలతాదేవి అధ్యక్షతన గృహ నిర్మాణాలపై సచివాలయాల సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఈఈ మాట్లాడుతూ 2025 డిసెంబరు నాటికి పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. మండలంలో సుమారు 60మంది లబ్ధిదారులకు రూ. 15.55లక్షలు చెల్లించారన్నారు. అయితే ఆయా గృహాల నిర్మాణం పూర్తికాలేదని, వాటన్నింటిని పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని, నిర్మాణాలు పూర్తయిన వెంటనే ఫైనల్ బిల్లులు చెల్లిస్తామని అన్నారు. కొత్త పీఎంజేవై 2.0 పథకం ప్రకారం పాత స్కీములకు కాలపరిమితిని విధించారని, కాల వ్యవధిలోగా పూర్తిచేయకుంటే రద్దవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏఈఈ షేక్ గౌస్‌బాషా, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి ఆధారాలివ్వాలి

● మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామారావు

శావల్యాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని పొందేందుకు మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల పరిధిలోని రైతులంతా వీఏఏలను కలసి తమ ఆధారాలను సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామినేని రామారావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 7 రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 12,559 మంది రైతులు ఉన్నారని, రెవెన్యూ గ్రామాలవారీగా కనమర్లపూడి 1160, పోట్లూరు 2145, వేల్పూరు 1741, శానంపూడి 2596, కొత్తలూరు 1544, కారుమంచి 2348, పిచికలపాలెం 1025మంది రైతులున్నారన్నారు. వారంతా ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లను వీఏఏలకు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకొంటేనే నగదు వారి బ్యాంకు ఖాతాలకు జమవుతుందని తెలిపారు.

రైతుబజార్‌లో లీగల్ మెట్రాలజీ దినోత్సవం


కాటాల తూకాలు పరిశీలిస్తున్న అధికారులు

చిలకలూరిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా జిల్లా తూనికలు, కొలతలు శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు, వర్తకులకు పట్టణంలోని రైతుబజార్‌లో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ పల్నాడు జిల్లా ఇన్‌స్పెక్టర్ శంకరరావు మాట్లాడుతూ వినియోగదారులు సరుకులు కొనుగోలు చేసినప్పుడు వారికి ఖచ్చితమైన తూకం ప్రకారం విక్రయించాలని, అందుకు వాడే కాటాలను ప్రతి సంవత్సరం లీగల్ మెట్రాలజీ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న స్టాంపింగ్‌కు పంపించి తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ వారు ఇచ్చే సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పిల్లి యజ్ఞ నారాయణ మాట్లాడుతూ వినియోగ దారులు సరుకులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఖచ్చితమైన తూకం అడిగే హక్కు, వినియోగదాల సంఘం వారికి గాని ఫిర్యాదు చేసే హక్కు ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఇన్‌చార్జ్ మురికి పూడి ప్రసాద్, సహాయ కార్యదర్శి విక్రమ్, రైతు బజార్ ఎస్టేట్ మేనేజర్ కాజా పాల్గొన్నారు.